

అంతా నా ఇష్టం

కలెక్టరేట్‌లో ఆయనో కీలక అధికారి. నగదు చెల్లింపుల ఫైళ్లన్నీ ఆయన పరిశీలించి అనుమతిస్తేనే ముందుకు కదులుతాయి. కలెక్టర్ కొత్తగా రావడంతో పరిపాలన యావత్తును తన చేతుల్లోకి తీసుకున్న ఈ అధికారి చెప్పిందే వేదంగా నడుస్తోంది. ఉద్యోగులు ఎవరైనా తమ ఇబ్బందులను కలెక్టర్‌కు చెప్పుకునేందుకు వెళితే చీవాట్లు తప్పవు. 'నాకు చెప్పకుండా కలెక్టర్ వద్దకు ఎందుకు వెళ్లారు' అంటూ అధికారులపై ఈ అధికారి చిందులు తొక్కడం ఇటీవల కాలంలో అధికమైంది. ఈ అధికారి తీరుతో వివిధ విభాగాల్లోని ఉద్యోగులు విసిగిపోయి తమగోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

కలెక్టరేట్‌లో కీలక అధికారి ఇష్టారాజ్యం



- అధికారులను కలెక్టర్ వద్దకు వెళ్లనివ్వని వైనం
- ఎన్నికల సమయంలో అంతా నొక్కుడే
- అధికారులకు భోజన ఖర్చుల్లోనూ ఇదే తీరు
- వీడియో గ్రాఫర్లకు నగదు చెల్లింపుల్లేవు
- ఎన్నికల విధులకు అధికారులకిచ్చే నగదులో కోత
- ఈ విషయం ఎక్కడా చెప్పవద్దని ఆదేశం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో కోట్లాది రూపాయలు ఖర్చు చేశారు. ఎన్నికల వ్యయానికి సంబంధించి ఆడిట్ లేకపోవడంతో ఈ అధికారి తన చిత్తానుసారంగా లెక్కలు రాయించి పై అధికారికి అంతా సక్రమంగానే జరిగినట్టుగా చూపి సంతకాలు చేయించారనే ఆరోపణలున్నాయి. తనకు అనుకూలమైన అధికారులను ఎన్నికల వ్యయంలో లెక్కలు సరిచేసే పనిలో నియమించుకుని, లెక్కల్లో ఎక్కడా దొరక్కుండా, ఎలా రాయాలో సూచనలు, సలహాలు ఇచ్చి మరీ రాయించారని కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగులు చెబుతున్నారు. ఎన్నికల విభాగంలోని ఇద్దరు అధికారులు ఈ కీలక అధికారికి తోడయ్యారు. ఎన్నికల విధులను నిర్వహించాలని ఒకవైపు అధికారులపై ఒత్తిడి తెస్తూనే, ఎన్నికల వ్యయంలో వివిధ విభాగాల్లో ఏ రూపంలో ఎంత మిగుల్చుకోవాలనే అంశంపైనే ఈ ముగ్గురు నిత్యం దృష్టి కేంద్రీకరించి తెరవెనుక చక్రం తిప్పారని కలెక్టరేట్ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు. ఈవీఎంలను కలెక్టరేట్‌కు తీసుకురావడం, వాటిని స్ట్రాంగ్ రూమ్ నుంచి ఆయా నియోజకవర్గాల్లోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించడం వంటి పనుల్లో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది రాత్రి, పగలు తేడా లేకుండా కష్టపడి పనిచేశారు. ఇలా పనిచేసిన అధికారులు, సిబ్బందికి కనీసంగా భోజన ఏర్పాట్లు కూడా చేయకుండా అన్నీ కల్పించినట్టు లెక్కలు రాసినట్టు ఉద్యోగులు చెప్పుకుంటున్నారు. ఎన్నికల సమయంలో ఉపయోగించకుండా మిగిలిన ఈవీఎంలను మచిలీపట్నం మార్కెట్ యార్డులోని గోడౌన్‌లో భద్రపరిచారు. ఎన్నికల సమయంలో ఈ ముగ్గురు అధికారులు వ్యవహరించిన తీరుపై కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగులు ఏ నలుగురు ఒకచోట చేరినా ఇదే అంశంపై చర్చించుకోవడం నేటికీ కనిపిస్తూనే ఉంది. ఎన్నికల సమయంలో పోలింగ్ సిబ్బందికి, అధికారులకు పలుమార్లు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించిన సమయంలోనూ ఇదే ధోరణితో వ్యవహరించారని పలువురు ఉద్యోగులు చెబుతున్నారు.

ఈసీ ఆదేశాలు బేఖాతరు

ఎన్నికల విధుల్లో పాల్గొన్న అన్ని విభాగాల అధికారులు, సిబ్బందికి ఒక నెల జీతాన్ని గౌరవవేతనంగా ఉద్యోగులకు ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికలసంఘం ఉత్తర్వులు జారీ చేసింది. 80 రోజులపాటు ఎన్నికల విధుల్లో పనిచేసిన ఉద్యోగులు, సిబ్బందిని గుర్తించి వారి హోదాను బట్టి ఎంతమొత్తం ఇవ్వాలో సూచించి, నేరుగా ఈ నగదును ఉద్యోగుల పేరుతో ట్రెజరీలకు పంపాలని కూడా ఆదేశాలు జారీ చేసింది. అయితే మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంతోపాటు, ఇతర విభాగాల్లో ఎన్నికల విధుల్లో పనిచేసిన ఉద్యోగులకు ఇంతవరకు నగదును జమచేయలేదని ఉద్యోగులు చెబుతున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నగదును జమచేయాలని ఉద్యోగులు ఈ కీలక అధికారిని కోరితే నగదు అయిపోయిందనీ, ఈ సంగతి మరచిపోండని చెప్పారని వాపోతున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న నోడల్ అధికారులు, ఇతరత్రా విభాగాల్లో పనిచేసిన ఉద్యోగులకు ఎన్నికల నిమిత్తం కనీసంగా రూ.40 వేలను గౌరవవేతనంగా ఇవ్వాల్సి ఉన్నా రూ.30వేలు ఇచ్చి సరిపెట్టినట్లు సమాచారం. ఓటర్ల జాబితాల ప్రింటింగ్‌లో ఎన్నికల విభాగం అధికారులు, జిల్లాలోని కీలక అధికారి తమదైన శైలిలో బిల్లులు చేసుకున్నట్టు ఉద్యోగులు చెప్పుకుంటున్నారు. ఎన్నికల అభ్యర్థులకు ఏర్పాట్ల పేరుతో పెద్దమొత్తంలో లెక్కలు రాసి బిల్లులు చేసుకున్నారనే ఆరోపణలున్నాయి.

ఫొటో, వీడియోగ్రాఫర్ల బిల్లుల్లోనూ కోత

ఎన్నికల సమయంలో నిఘా ఏర్పాటు చేసేందుకు ఫొటో, వీడియోగ్రాఫర్లను ఏర్పాటు చేశారు. రోజుకు మూడు షిఫ్టుల్లో పనిచేసినందుకుగాను మూడువేల రూపాయల చొప్పున ఇస్తామని ఆదేశాలు జారీ చేశారు. కొంతకాలం పోయాక అంత ఇవ్వలేమని రోజుకు రూ.1800 ఇస్తామని చెప్పారు. ఈ బిల్లులు కూడా ఇవ్వకపోవడంతో ఆర్‌వోల చుట్టూ, కలెక్టరేట్ చుట్టూ ఫొటోగ్రాఫర్‌లు, వీడియోగ్రాఫర్‌లు తిరుగుతూనే ఉన్నారు.



థియేటర్ వద్ద ఎమ్మెల్యే వెనిగండ్ల, మాజీ ఎమ్మెల్యే రావి తదితరులు

వైసీపీ ఆఫీసు ఖాళీ

శరత్ థియేటర్ యాజమాన్యాన్ని బెదిరించి లాక్కున్న మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని

- ఎమ్మెల్యే వెనిగండ్లకు యాజమాన్యం ఫిర్యాదు
- వైసీపీ ఆఫీసును ఖాళీ చేయించిన వైనం
- కొడాలి నాని, పార్టీ ఫ్లెక్సీల తొలగింపు
- థియేటర్ యాజమాన్యం తిరిగి స్వాధీనం

గుడివాడ : గత పదేళ్లుగా మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని ఆక్రమణలో ఉన్న శరత్ థియేటర్‌కు విముక్తి లభించింది. థియేటర్‌లోని వైసీపీ ఫ్లెక్సీలు, కొడాలి నాని ఫొటోలు తొలగించారు. థియేటర్‌ను యాజమాన్యానికి అప్పగించారు. కేవలం ఒక్క వాటా హక్కు కలిగిన నాని మిగిలిన ముగ్గురు వాటాదారులను బెదిరించి మొత్తం థియేటర్‌ను తన ఆధీనంలో ఉంచుకున్నారు. గత ఐదేళ్లుగా అధికారాన్ని అడ్డు పెట్టుకుని థియేటర్ యాజమాన్యాన్ని బెదిరించి ఆక్రమించుకుని వైసీపీ కార్యాలయంగా మార్చుకున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కొడాలి నాని చిత్తుచిత్తుగా ఓడిపోయారు. నాని ముఖం చాటేసి గుడివాడ వదిలి హైదరాబాద్‌లో తలదాచుకుంటున్నారు. శరత్ థియేటర్ పాత యాజమాన్యంలోని ముగ్గురు వాటాదారులు స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రామును కలిసి తమక న్యాయం చేయాలని కోరారు. రంగంలోకి దిగిన వెనిగండ్ల... నాని అక్రమాలకు చెక్ చెడుతూ పాత యాజమాన్యానికి థియేటర్‌ను అప్పగించారు.

థియేటర్‌లో టీ పార్టీ

వాటాదారుల్లో ఒకరైన మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు థియేటర్‌లో మంగళవారం టీ పార్టీ ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావులతో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల మాట్లాడుతూ గుడివాడలో నాని అనుచరులు పేద, మధ్య తరగతి వర్గాల ఆస్తులను కబ్జాచేశారన్నారు. అందరికి న్యాయం చేస్తామన్నారు. థియేటర్ వాటాదారులు యలవర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏళ్ల తరువాత తన ఆస్తిని చూసుకునేందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ థియేటర్ యజమానులకు హక్కును వారికి కల్పించేందుకు వచ్చామన్నారు. నాని అవినీతిపై చట్టపరమైన విచారణ ప్రారంభమవుతుందన్నారు.

నాలుగు నెలల్లోనే ఒక అధికారిని ప్రాధాన్యత లేని చోటుకు బదిలీ చేస్తే ఏమనుకోవాలి? అతనేదైనా తప్పు చేసి ఉండాలి. లేదంటే ఉన్నతాధికారుల కక్ష అయినా ఉండాలి. ఇదేమీ లేకుండా ఊరికినే బదిలీ చేయరు. మరి ఇలా బదిలీ చేసిన అధికారిని తిరిగి యథాస్థానానికి వెంటనే రివర్స్ బదిలీ ఇచ్చారంటే ఏమనుకోవాలి? అనేక రకాలుగా అర్థం చేసుకోవచ్చు. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని ఒక పర్సనల్ అధికారి విషయంలో ఈ వింత పరిణామం చోటు చేసుకుంది. స్పీడ్‌గా బదిలీ జరగటం, అంతే స్పీడ్‌గా రివర్స్ బదిలీ జరగటం వెనుక మర్మమేమిటన్నది విజయవాడ రైల్వే డివిజన్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది.

మూడు నెలల్లో రివర్స్ బదిలీ

బెజవాడ రైల్వేలో విచిత్రం

- పర్సనల్ అధికారి రాయనపాడుకు బదిలీ
- మళ్లీ విజయవాడకు మార్పు
- వివాదాలకు కేరాఫ్‌గా పర్సనల్ ఆఫీసు
- అధికారిపై అనేక ఆరోపణలు
- మహిళలపై లైంగిక వేధింపుల వ్యవహారంపై డీఆర్‌ఎంకు ఫిర్యాదు
- డీఆర్‌ఎంకు గ్రాండ్ బర్త్ డే ట్రీట్ వ్యవహారం చర్చనీయాంశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ రైల్వే డివిజన్‌పై ఇప్పటికే సీబీఐ దృష్టి సారించిన నేపథ్యంలో, పర్సనల్ అధికారి రివర్స్ బదిలీ అంశం పెద్దఎత్తున విమర్శలకు, ఆరోపణలకు దారి తీస్తోంది. విజయవాడ డివిజన్‌కు ఎన్నికల ముందు పర్సనల్ ఆఫీసర్‌గా ఒక

- మిగతా 6లో

సీపీడీసీఎల్‌లో పదవుల పందేరం

కీలక పోస్టుల్లో తమవారి కోసం కాంట్రాక్టర్ల ప్రయత్నాలు



- పదవుల్లో చేరడానికి పాత డైరెక్టర్ల ప్రయత్నాలు
- వైసీపీ హయాంలో అడ్డగోలుగా వ్యవహరించిన అధికారుల కోసం ఆరాటం

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : సీపీడీసీఎల్‌కు కొద్దిరోజుల క్రితం వరకు సంతోషరావు ఇన్‌చార్జి సీఎండీగా వ్యవహరించేవారు. ఆయన ఎస్పీడీసీఎల్‌కు రెగ్యులర్ సీఎండీ సీపీడీసీఎల్ ఇన్‌చార్జి బాధ్యతలను ఆయనకు అప్పగించారు. కొద్దిరోజుల క్రితం సంతోషరావుకు ఇన్‌చార్జి బాధ్యతలను ప్రభుత్వం తప్పించింది. ఆయన స్థానంలో చక్రధరబాబుకు బాధ్యతలను అప్పగించింది. వైసీపీ ప్రభుత్వంలో గుంటూరు జిల్లాకు చెందిన ఓ విశ్రాంత అధికారి సీపీడీసీఎల్‌లో డైరెక్టర్‌గా పనిచేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాజీనామా చేయకుండా కుర్చీని అతుక్కుని కూర్చున్నారు. నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారితో రాజీనామాలు చేయించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో ఆ డైరెక్టర్ రాజీనామా చేశారు. సీపీడీసీఎల్‌కు సీఎండీగా ఎవరు ఉన్నా తమ వ్యవహారాలను చక్కబెట్టుకుంటూ, కాంట్రాక్టర్లకు మేలు చేసిన ఈ డైరెక్టర్‌కు సీపీడీసీఎల్‌పై ప్రేమ చావలేదు. తిరిగి సీపీడీసీఎల్‌లోకి అడుగు పెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

వైసీపీ హయాంలో అన్ని శాఖల్లోనూ ఆ పార్టీ రంగు పూసుకున్న కాంట్రాక్టర్లు వాలిపోయారు. వారు చెప్పిన మాటలకు తల ఊపిన అధికారులను నియమించుకున్నారు. కుదరదని సమాధానం చెప్పిన అధికారుల కుర్చీలు కదిపేశారు. ఇలాంటి వ్యవహారాలు సాగిన శాఖల్లో సీపీడీసీఎల్ (సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్) ఒకటి. ప్రభుత్వం ఒకపక్క ప్రక్షాళన చేస్తుంటే మరోపక్క మంచి కాంట్రాక్టర్లు కూటమి నేతల వద్ద తెర వెనుక ప్రయత్నాలు చేస్తున్నారు. తమకు అనుకూలంగా ఉన్న అధికారులను తిరిగి తీసుకొచ్చి కుర్చీల్లో కూర్చోబెట్టే వ్యవహారాలను చాపకింద నీరులా సాగిస్తున్నారు.

గత ప్రభుత్వంలో అడ్డగోలుగా కాంట్రాక్టులు


జగన్ సీఎంగా ఉన్నప్పుడు సీపీడీసీఎల్‌లో అడ్డగోలుగా కాంట్రాక్ట్‌లను దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఇప్పుడు రంగంలోకి దిగుతున్నారు. తమకు అనుకూలంగా ఉన్న అధికారులను, డైరెక్టర్లను నియమించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. మరోపక్క సంతోషరావును తిరిగి సీపీడీసీఎల్‌కు రావడానికి పావులు కదుపుతున్నట్టు విద్యుత్ ఉద్యోగుల్లో చర్చ నడుస్తోంది. సీపీడీసీఎల్ ఏర్పాటు చేసిన తర్వాత అవుట్ సోర్సింగ్‌లో తమకు అనుకూలంగా ఉన్న వారిని నియమించుకున్నారు. కార్యాలయంలో ఏ ఫైలులో ఏ సారాంశం ఉందన్న విషయాలను వారి ద్వారా తెలుసుకుంటున్నట్టు సమాచారం.

ఎస్‌ఈ పోస్టుకు మరో రూటు

సీపీడీసీఎల్ ఎస్‌ఈగా ఉన్న మురళీమోహనరావు తన పదవిని కాపాడుకోవడానికి నానాపాట్లు పడుతున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా ఎస్‌ఈగా ఉన్న ఆయనను వైసీపీ ప్రభుత్వం ఇక్కడి నుంచి బదిలీ చేసింది. నెల నిండకుండానే తిరిగి ఎస్‌ఈగా వచ్చారు. ఇప్పుడు ఆయన తనకు పదోన్నతి వచ్చే వరకు సీపీడీసీఎల్ ఎస్‌ఈగా కొనసాగాలని భావిస్తున్నారు. దీనికి సంబంధించి ఒక్కో అడుగు ముందుకు వేస్తూ అడ్డంకులు లేకుండా చేస్తున్నారు. మురళీమోహనరావు సీఈ పదోన్నతి జాబితాలో ఉన్నారు. ఈ పదోన్నతి ఎప్పుడు వస్తుందో తెలియదు. అప్పటి వరకు ఆయన ఇక్కడే ఎస్‌ఈగా కొనసాగాలని భావిస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాస్థాయి అధికారుల్లోనూ మార్పు ఉంటుందన్న ప్రచారం నడుస్తోంది. దీంతో మురళీమోహనరావు తన సీటును కాపాడుకునే ప్రయత్నాలు జోరుగా సాగిస్తున్నారు. ఇప్పటికే ఏలూరు జిల్లాకు చెందిన ఓ మంత్రి నుంచి లేఖ తీసుకున్నట్టు సమాచారం. ఎస్‌ఈకి సీఈ పదోన్నతి వచ్చే వరకు ఇక్కడి నుంచి బదిలీ చేయవద్దని లేఖ ఇవ్వడం విద్యుత్ శాఖలో చర్చనీయాంశమవుతోంది. మురళీమోహనరావు చేస్తున్న ప్రయత్నాలకు విద్యుత్ ఉద్యోగుల సంఘంలోని ఒక కీలకనేత సహాయ సహకారాలు అందిస్తున్నట్టు సమాచారం.

కొండకు పరిష్కారమేదీ?

కొండచరియల సమస్యకు కానరాని శాశ్వత పరిష్కారం



కొండ మీదుగా దిగువకు ఇనుప మెష్

వాతావరణం మారినప్పుడల్లా ఇంద్రకీలాద్రి వణుకు పుట్టిస్తోంది. ఒక మోస్తరు వర్షం కురిస్తే ఎటువైపు నుంచి కొండచరియలు విరిగి పడతాయో తెలియని పరిస్థితి నెలకొంది. మళ్లీ వాతావరణం మామూలు పరిస్థితికి వచ్చే వరకు అధికారులకు ఒక టెన్షన్. భక్తులకు మరో టెన్షన్. ఎక్కడ రాయి విరిగి పడినా మొత్తం ఘాట్ రోడ్డును మూసివేయాల్సిన పరిస్థితి. అలాగని మామూలుగా వదిలేస్తే ఎలాంటి ప్రమాదం వస్తుందో అంచనా వేయలేని పరిస్థితి. ఇంద్రకీలాద్రి కొండచరియలు విరిగిపడడానికి శాశ్వత పరిష్కారం ఎప్పటికి లభిస్తుందో తెలియడం లేదు.

> చిన్నపాటి వర్షానికే ఘాట్ రోడ్డును మూసేస్తారా?
>
> \- ఇంద్రకీలాద్రికి వచ్చే భక్తుల మనస్సులో మాట ఇది.

> వర్షాలు కురుస్తున్నాయి. ఎక్కడి నుంచి ఎలాంటి రాయి జారుకుంటూ కిందపడుతుందో తెలియదు. ఒకచోట ప్రత్యామ్నాయ చర్యలు చేపడితే మరోచోట ఇబ్బంది వస్తుంది.
>
> \- ఇంజనీరింగ్ అధికారుల ఆందోళన ఇది.

- ఘాట్ రోడ్డు మూసివేత ఒక్కటే మార్గమా?
- నిపుణులకు అంతుబట్టని ఇంద్రకీలాద్రి స్వరూపం

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన కొండల్లో ఇతర కొండలకు ఇంద్రకీలాద్రికి చాలా వ్యత్యాసం ఉంది. తిరుమలతో సహా ఇతర కొండలు రాయితో చాలా బలంగా ఉంటాయి. ఇంద్రకీలాద్రిలో మాత్రం భిన్న లక్షణాలు కనిపిస్తాయి. చూడడానికి గిరిగా కనిపిస్తున్నప్పటికీ గర్భంలో మాత్రం అంత పటిష్టం లేదని నిపుణులు గుర్తించారు. ఇంద్రకీలాద్రిలో గుల్లదనం ఎక్కువ ఉంది. రాయి, రాతిసున్నం మిశ్రమంతో ఈ కొండలు ఏర్పడ్డాయి. మొక్కలు, చెట్లు పెరిగినా వర్షాలు కురిసిన ప్పుడు గుల్లదనం బయట పడుతుంది. వర్షపునీరు కొన్నిచోట్ల నిలిచిపోవడంతో అది నెమ్మదిగా కొండలోకి దిగుతోంది. ఫలితంగా లోపల భాగం చెమ్మగా మారు తోంది. ఇది వర్షాలు పడినప్పుడు మరింతగా పెరిగి రాళ్లు జారి పడుతున్నాయి. ఈ రాళ్లు ఘాటు రోడ్డుపై పడుతుం డటంతో పైనుంచి కింది వరకు ఇనుప మెస్ ఏర్పాటు చేశారు. రాక్ మెటిగేషన్ విధానంలో ఇప్పటి వరకు 330 మీటర్ల వరకు ఇనుప మెష్ ఏర్పాటు చేశారు. ఇంకా 180 మీటర్ల మేర ఈ మెస్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది.



నివేదికలకే పరిమితం

ఇంద్రకీలాద్రిని పరిశీలించడానికి, అధ్యయనం చేయడానికి ఒక్కోసారి ఒక్కో నిపుణుల కమిటీ వస్తోంది. కొండపై కురిసిన వర్షం కిందికి వెళ్లిపోవడానికి కాలువలు నిర్మాణం చేయాలని సూచించారు. దీనివల్ల వర్షపు నీరు కిందికి వెళ్లిపోతుందని భావించారు. ఇంద్రకీలాద్రిపైన స్వరూపం మాత్రం భిన్నంగా ఉంటుంది. ఇది మొత్తం ఎత్తుపల్లాలుగా ఉంటుంది. ఇప్పటికే కొండపై మధ్యలో ఒక కొలనులాంటి ప్రదేశం ఉంది. కాలువలు నిర్మించినా ఈ వర్షపు నీరు కిందికి వెళ్లపోగా తిరిగి ఇదే కొలనులోకి వెళ్తాయని ఇంజనీరింగ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. దీనివల్ల కొండ పైభాగం మరింత బలహీనపడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కొండ ఏటవాలుగా ఉంటేనే కాలువల ప్రణాళిక పనిచేస్తుందని భావిస్తున్నట్టు సమాచారం.

కొండ చుట్టూ డబుల్ ట్విస్టెడ్ ఎక్సాగానల్

కొండకు చుట్టూ డబుల్ ట్విస్టెడ్ ఎక్సాగానల్ (ఆరు భుజాలు) వైర్ మెష్‌ను ఏర్పాటు చేశారు. దీన్ని జర్మనీ నుంచి తీసుకొచ్చి మెకాఫెర్రీ కంపెనీ ఈ పనులు చేసింది. ఇతర దేశాల్లో కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్నచోట్ల ఈ కంపెనీయే పనులు నిర్వహిస్తోంది. ఘాట్‌రోడ్డు వైపు కొండ చరియలు విరిగినప్పుడల్లా కొండపైకి రాకపోకలను కొన్ని రోజులపాటు నిలిపివేయాల్సి వస్తోంది. ఇప్పటివరకు ఘాట్ రోడ్డు వైపు కొండ చరియలు విరిగిపడగా, తాజాగా జాతీయ రహదారివైపు కొండచరియలు విరిగిపడ్డాయి. మోడల్ గెస్ట్‌హౌస్‌కు ఎదురుగా ఉన్న కొండ భాగం దసరాకు ముందు విరిగి పడింది. ఈ ప్రదేశంలో కొండచరియలు పడకుండా రహదారి పక్క నుంచి రిటైనింగ్ వాల్‌ను నిర్మించాలన్న ప్రతిపాదనను నిపుణులు చేశారు. బెంగళూరులో ఉన్న సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రాక్ మేనేజ్‌మెంట్‌కు చెందిన కొంతమంది నిపుణులు విజయవాడకు వచ్చారు. కొండచరియలు పడేటప్పుడు సూచనలు తెలియడం కోసం సెన్సార్లు ఏర్పాటు చేయాలని భావించారు. కొండచరియల సమస్య మాత్రం ఇంజనీరింగ్ అధికారులపై తీవ్రమైన ఒత్తిడి పెంచుతోంది. ఎలాంటి చిన్న ప్రమాదం జరిగినా ముందుగా తామే బలైపోతామన్న భయం వారిని వెంటాడుతోంది. ఇంద్రకీలాద్రిని అన్ని కోణాల్లోనూ అధ్యయనం చేస్తేనే పరిష్కార మార్గాలు వస్తాయన్న భావన అధికారుల్లో కనిపిస్తోంది.



కొండపైన కోలాహలం

- సర్వమంగళకారిణి దుర్గమ్మకు సారె సమర్పణలు
- మొక్కులు తీర్చుకున్న భక్త బృందాలు



వన్‌టౌన్, జూలై 16 : ఇంద్రకీలాద్రిపై సర్వమంగళ కారిణి కనకదుర్గమ్మకు మంగళవారం పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆషాఢం సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. 39 బృందాలకు చెందిన మొత్తం 1750 మంది భక్తులు సారె సమర్పణలో పాల్గొన్నారు. అత్యంత కోలాహలం మధ్య భక్తి తత్పరతతో మహిళాభక్తులు సారె సమర్పించారు. అనేక రకాల తీపి పదార్థాలు, పండ్లు, పూలు, గాజులు, పసుపు కుంకుమ, గంధం తదితర పరిమళ ద్రవ్యాలను అమ్మవారికి సమర్పించారు. విజయవాడకు చెందిన దుర్గా శివసాయి సేవా సంఘం 200 మంది, రాధా మాధవి భక్త బృందం 100 మంది, సింగ్‌నగర్‌కు చెందిన దుర్గా బృందం 100 మంది, గురుభవానీ బృందం 100 మంది, భవానీపురానికి చెందిన కోదండరామాలయం సేవా సమితి నుంచి 170 మంది, పరిటాల నుంచి దుర్గా శివసాయి ఉండి సేవా సంఘం 200 మంది, విశాఖపట్నం నుంచి అన్నమాచార్య సేవా సమితికి చెందిన 50 మంది ఇలా అనేక ప్రాంతాలనుంచి మొత్తం 1750 మంది సారె సమర్పించారు.

19 నుంచి శాకంబరీ ఉత్సవాలు

ఈనెల 19 నుంచి 21 వతేదీ వరకు శాకంబరీ ఉత్సవాలను ఆలయంలో నిర్వహించ నున్నారు. ఇందుకు తగిన ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నట్లు దేవస్థానం ఒక ప్రకటనలో తెలిపింది. మూడు రోజుల పాటు అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు పండ్లు ఆకు కూరలతో అలంకరిస్తారు.

27 నుంచి సుబ్బారాయుడి పవిత్రోత్సవాలు

మోపిదేవి, జూలై 16 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఆషాఢ మాసం పురస్కరించుకుని ఈ నెల 27 నుంచి పవిత్రోత్సవాలు, ఆడికృత్తిక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.ఎస్.చక్రధరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీ ఉదయం 8 గంటలకు గోపూజతో పవిత్రోత్సవాలు ప్రారంభమై 28వ తేదీ సుబ్రహ్మణ్య మూలమంత్ర అనుష్ఠానములు, మూలమూర్తులు, ఉత్సవమూర్తులకు పట్టుపవిత్రముల సమర్పణ, 29వ తేదీ గోపూజ, హవనము, పవిత్ర జల ప్రోక్షణ, పూర్ణాహుతి కార్యక్రమంతో ముగుస్తాయన్నారు. 30వ తేదీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి జన్మనక్షత్రం సందర్భంగా శ్రీ వల్లీదేవసేన అమ్మవార్లకు శాకంబరి మహోత్సవం జరుగుతుందన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- దోమల నివారణ, శానిటేషన్‌లో ప్రజల భాగస్వామ్యం అవసరం
- ఓవర్‌హెడ్ రిజర్వాయర్లలో క్లీనింగ్, క్లోరినేషన్ పూర్తిచేయండి
- విద్యార్థి దశ నుంచే అవగాహన
- అన్ని ఆర్వో ప్లాంట్ల మ్యాపింగ్ జరగాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



సీజనల్ వ్యాధులు, దోమల వ్యాప్తి నియంత్రణపై అవగాహన పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ సృజన

కృష్ణలంక, జూలై 16 : సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ ప్రజల భాగస్వామ్యంతో పారిశుధ్యం, దోమల నివారణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని అమలు చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. నగరంలోని కాలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం శానిటేషన్, సీజనల్ వ్యాధులపై పంచాయతీరాజ్, వైద్యఆరోగ్య, నగరపాలక సంస్థ, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యంగా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వ్యాధులు ప్రబలడానికి ముందే వాటిని అరికట్టే విధంగా అవగాహన కల్పించి ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. దోమల ద్వారా ప్రబలే మలేరియా, డెంగ్యూ చికెన్‌గున్యా వంటి వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. జిల్లాలోని 288 గ్రామపంచాయతీలలో 389 హ్యాబిటేషన్లలో ప్రతిరోజు నిర్వహించే శానిటేషన్‌తో పాటు ఈ వర్షాకాల సీజన్‌లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. జిల్లాలోని 588 ఓహెచ్ఎస్ఆర్ ఓవర్ హెడ్ రిజర్వాయర్లలో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం క్లీనింగ్ అనంతరం జియో టాగింగ్, ఫోటోను నిర్దేశించిన ఫార్మాట్‌లో పొందుపరచాలన్నారు. క్లీనింగ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఈవోపీఆర్డీ సర్టిఫికెట్ తప్పనిసరి అన్నారు. ఎక్కడైనా ఓహెచ్ఎస్ఆర్ శుభ్రం చేయలేదని ఆరోపణ వస్తే సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నగరపాలక సంస్థ, మున్సిపల్, గ్రామ పంచాయితీల పరిధిలోని ఆర్వో ప్లాంట్ల మ్యాపింగ్ చేయాలన్నారు. దోమల నియంత్రణ, శానిటేషన్‌పై అవగాహన పోస్టర్లు, కరపత్రాలు, వీడియో షార్ట్ క్లిప్పింగ్స్ ద్వారా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థి దశ నుంచే శానిటేషన్, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించే విధంగా ప్రతి శనివారం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహించే అసెంబ్లీలో విద్యార్థులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అవగాహన పోస్టర్లు, పాంప్లెట్లను కలెక్టర్ సృజన విడుదల చేశారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ ఎ.మహేష్, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, డీపీవో శివప్రసాద్ యాదవ్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు, నగరపాలక సంస్థ మెడికల్ ఆఫీసర్ రత్నావళి, డీసీహెచ్ఎస్ డాక్టర్ బీసీకే నాయక్, డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు జిల్లా కో-ఆర్డినేటర్ జె.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీఆర్ కార్డుల పంపిణీ పూర్తి చేయాలి

- వ్యవసాయ అనుబంధ రంగాల శాఖల ప్రగతిపై కలెక్టర్ సృజన సమీక్ష



అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ సృజన

కృష్ణలంక, జూలై 16 : కౌలు రైతులకు క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డ్ (సీసీఆర్‌సీ) పంపిణీ, పీఎం కిసాన్ యోజన వెరిఫికేషన్ ప్రక్రియ త్వరతగతిన పూర్తి కావాలని కలెక్టర్ జి.సృజన వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ అనుబంధ రంగాల శాఖల ప్రగతిపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ, కౌలు రైతులకు ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరాలంటే కౌలు రైతు గుర్తింపు కార్డు తప్పనిసరన్నారు. సీసీఆర్సీ కార్డు ద్వారా కౌలు రైతులు పంటల బీమా పథకంలో నమోదు చేసుకొనే వీలుందన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని సీసీఆర్‌సీ కార్డుల పంపిణీ త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 16 మండలాల్లోని 311 గ్రామాలలో 55,560 కార్డుల పంపిణీ చేయాల్సి వుండగా ఇప్పటివరకు 12,380కి పైగా కార్డుల పంపిణీ చేసినట్టు వ్యవసాయ శాఖ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా త్వరతగతిన నూరు శాతం కార్డుల పంపిణీ పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన (పీఎం కిసాన్) పథకంలో అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ త్వరతగతిన పూర్తికావాలన్నారు. ఇప్పటివరకు 8,497 దరఖాస్తులకు గాను 6 వేల దరఖాస్తులు పూర్తికాగా.. పెండింగ్ వున్న 2,494 దరఖాస్తులు పరిశీలన ప్రక్రియ 15 రోజులలోగా పూర్తిచేయాలన్నారు. జగ్గయ్యపేట వీరులపాడు మండలాల్లో 84 శాతం వెరిఫికేషన్ పూర్తికాగా మిగిలిన జిల్లాల్లో తక్కువ శాతం పరిశీలన పూర్తికావడంపై వ్యవసాయ శాఖ అధికారులను వివరణ కోరారు. జిల్లాలో ఉద్యాన శాఖ ద్వారా 43,563 హెక్టార్లలో కూరగాయలు, పండ్లు, స్పైసెస్, పూలతోటల సాగు జరుగుతుందని, వీటిలో మామిడి సాగు ప్రధానంగా జి.కొండూరు, మైలవరం, రెడ్డిగూడెం, తిరువూరు, ఎ.కొండూరు, విస్సన్నపేట, విజయవాడ రూరల్ మండలాల్లో జరుగుతుందని, ఆయిల్‌పామ్ పంట సాగుకు అవసరమైన సీడింగ్ నర్సరీ రెడ్డిగూడెం మండలం నాగులూరు గ్రామంలో వుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి కలెక్టర్‌కు వివరించారు. వర్షాలు కురుస్తున్నందున ఉద్యాన పంటల సాగుకు రైతులను సన్నద్ధం చేసి ప్రోత్సహించాలని కలెక్టర్ అధికారులను కోరారు. మత్స్యశాఖ అమలుచేస్తున్న ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో అర్హులైన లబ్దిదారుల యూనిట్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ మార్కెట్‌లో టమాటా ధరలను సమీక్షించుకొని వినియోగదారులకు రైతుబజార్ల ద్వారా అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారిణి ఎస్.నాగమణెమ్మ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి పి.బాలాజీకుమార్, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి కె.విద్యాసాగర్, సెరీకల్చర్ ఆఫీసర్ ఎన్.సత్యనారాయణ, అగ్రీ ట్రేడ్ మార్కెటింగ్ అధికారి కె.మంగమ్మ, మత్స్యశాఖ అధికారి పెద్దిరాజు, డీసీవో పి.త్రినాథ్, ఏపీసీఎన్ఎఫ్ పీడీ డీఎంఎఫ్ విజయకుమారి సంబంధిత ధికారులు పాల్గొన్నారు.

పంట రుణాలలో కౌలు రైతుల వాటా పెంచాలి

వన్‌టౌన్: పంటరుణాలలో కౌలు రైతుల వాటాను పెంచాలని ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్రకమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ, కార్యదర్శి ఎం.హరిబాబులు మంగళవారం ఈమేరకు ఒక సంయుక్త ప్రకటన చేశారు. రాష్ట్రంలో 32 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారని, వారికి సగటున రూ 12,500 మాత్రమే పంట రుణం వస్తుందన్నారు. ప్రభుత్వం కూడా పదిలక్షలమంది కౌలు రైతులకు కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇటీవల జరిగిన బ్యాంకర్ల సమావేశంలో పంటరుణాలకు కేటాయించిన నాలుగువేల కోట్ల రూపాయలను పంచితే రూ. 40 వేలు చొప్పున మాత్రమే వస్తుందన్నారు. ఈపాటి కొద్ది మొత్తాలతో పంటలు వేయడం సాధ్యం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ లెక్కల మేరకు 80 లక్షల ఎకరాలలో పంట సాగు జరిగితే అందులో కౌలురైతులు 50 లక్షలకు పైగా ఎకరాలలో సాగు చేస్తున్నారన్నారు. వాటాను బట్టి లెక్కిస్తే రూ.1.66 లక్షల కోట్లలో కౌలు రైతులకు కనీసం లక్ష కోట్లయినా ఇవ్వాల్సి వస్తుందన్నారు. ఇటువంటి గణాంకాలు తేట తెల్లంగా ఉంటే కేవలం నాలుగువేల కోట్ల మేరకే కౌలు రైతులకు పంట రుణాలు ఇస్తామని ప్రణాళిక రూపొందించడం సరికాదన్నారు. గత ప్రభుత్వంలో 2000లేదా 3000 కోట్లమేరకు బటన్ నొక్కిన అనుభవం ఉందన్నారు.ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కౌలురైతులకు సంబంధించి అన్నిపంటలకు రుణాలు ఇచ్చేందుకు రూ.25 వేల కోట్లకు పెంచాలన్నారు.

పీఎంఈజీపీకి అర్హుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణలంక, జూలై 16 : పీఎంఈజీపీ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా గరిష్ఠంగా తయారీ యూనిట్లకు 50 లక్షల వరకు సర్వీసు యూనిట్లు రూ.20 లక్షల వరకు బ్యాంకుల ద్వారా రుణం పొందే అవకాశం వుందని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఈ పథకానికి అర్హులు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో 25 శాతం నుంచి 35 శాతం వరకు పట్టణ ప్రాంతాల్లో 15 శాతం నుంచి 25 శాతం వరకు సబ్సిడీ పొందవచ్చునని తెలిపారు. ఈ పథకం పూర్తిగా ఆన్‌లైన్ విధానం ద్వారా దరఖాస్తులు స్వీకరించబడతాయని, ఆసక్తి వున్న అభ్యర్థులు డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు.కేవీఐసీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తును సమర్పించాలని కోరారు. తదుపరి వివరాలకు ఆటోనగర్, విజయవాడలోని జిల్లా పరిశ్రమ కేంద్రం వారిని నేరుగా గానీ సంబంధిత అధికారులు ఆర్.రవికుమార్-8985063960, పి.రాజేష్‌కుమార్-8499882892, కె.వేణు-7382560676లను ఫోన్ ద్వారా సంప్రదించాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు..

వన్‌టౌన్, జూలై 16 : 2024 జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో నేషనల్ అవార్డ్స్ టు టీచర్స్. ఎడ్యుకేషన్. గవ్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 18 వతేలోగా పేర్లను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఈనెల 21లోగా పూర్తి చేసిన దరఖాస్తులను అప్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముందన్నారు. ఈ అంశాన్ని ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు తమ పరిధిలోని అర్హులైన ఉపాధ్యాయులకు తెలియజేయాలని కోరారు.

నేడు ఎన్టీఆర్ జిల్లా అండర్-7 చెస్ పోటీలు

విజయవాడ స్పోర్ట్స్, జూలై 16 : జూనియర్ చెస్ అకాడమీ, ది విజయవాడ చెస్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ఈనెల 17న గుణదలలోని అరుణ ఎలక్ట్రికల్స్ ఫస్ట్ ఫ్లోర్‌లో ఎన్టీఆర్ జిల్లా అండర్-7 బాలబాలికలకు వేర్వేరుగా చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ అక్బర్ బాషా, మండుల రాజీవ్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి రెండుస్థానాల్లో నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని, ఇతర వివరాలకు 9246181858 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.



స్వాధీనం చేసుకున్న మోటారు బైక్‌లు

గంజాయి విక్రయిస్తూ బైక్‌ల చోరీ..

- పోలీసుల అదుపులో ముగ్గురు మైనర్లు

గుడ్లవల్లేరు, జూలై 16 : విశాఖ పరిసర ప్రాంతాల నుంచి గంజాయి తెచ్చి గ్రామంలో పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ విద్యార్థులకు విక్రయిస్తూ, ఇక్కడి నుంచి బైక్‌లు దొంగిలించి తీసుకెళుతున్న వారిని మంగళవారం గుడ్లవల్లేరు పోలీసులు అదుపులోకి తీసుకుని జువనైల్ కోర్టుకు తరలించారు. గుడ్లవల్లేరు ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు పరిసర ప్రాంతాలకు చెందిన ముగ్గురు మైనర్లు విశాఖ ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిని తెచ్చి ఇక్కడ కళాశాలల వద్ద విక్రయిస్తూ వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నారు. ఈ క్రమంలో గుడ్లవల్లేరు వచ్చి తిరిగి వెళ్లే క్రమంలో వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద రెండు బైక్‌లు, గుడ్లవల్లేరు శివారు ప్రాంతంలో ఒక బైక్‌ను దొంగిలించి వెళుతుండగా పెంజంద్ర సమీపంలో వాహనాల తనిఖీల్లో మూడు బైక్‌లు ముగ్గురు బాలురు పట్టుబడ్డారు. మరో ఇద్దరు పరారయ్యారని ఎస్ఐ తెలిపారు. వారి వద్ద ఉన్న 500 గ్రాముల గంజాయి, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. సరకును, బైక్‌లు నిందితులను జువైనల్ కోర్టుకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

మూడు నెలల్లో రివర్స్ బదిలీ

(5వ పేజీ తరువాయి)

అధికారి వచ్చారు. ఈ అధికారి వచ్చీ రావటంతోనే వివాదాస్పదమయ్యారు. ఈయన తమపై తీవ్ర ఒత్తిళ్లు తీసుకు వస్తున్నారని ఉద్యోగులు ఉన్నతాధికారులకు లిఖిత పూర్వక ఫిర్యాదు ఇచ్చారు. తమను వేధిస్తున్నారని మహిళలు కూడా ఫిర్యాదు ఇచ్చారు. ఈ అధికారి కింద పనిచేసే ఒక ఉద్యోగి మహిళలను లొంగదీసుకునే విధంగా వ్యవహరిస్తున్నారని మహిళా ఉద్యోగులు పలువురు గతంలో ఫిర్యాదులు ఇచ్చారు. ఆ ఉద్యోగిపై మహిళా ఉద్యోగులు ఫిర్యాదు చేసిన క్రమంలో అంతర్గత విచారణ జరపగా ఆరోపణలు నిర్ధారణ అయ్యాయి. దీంతో మరో విభాగంలోకి ఆ ఉద్యోగిని బదిలీ చేశారు. అయినా ఇదే విభాగంలో ఆ ఉద్యోగి చక్రం తిప్పుతున్నాడు. డివిజినల్ పర్సనల్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులపై నెలకొంటున్న వేధింపులు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఎన్నికల సమయంలో ఇవన్నీ జరగటంతో.. పర్సనల్ కార్యాలయం పరిధిలో జరుగుతున్న వ్యవహారాలు బయటకు రాలేదు. కొంతమంది మహిళా ఉద్యోగులు మీడియా దృష్టికి తీసుకురావటంతో ఈ వ్యవహారం వెలుగు చూసింది. పర్సనల్ ఆఫీసర్‌కు నమ్మినబంటుగా ఉంటూ బదిలీ అయిన ఉద్యోగిపై మహిళా ఉద్యోగులు అనేక ఫిర్యాదులు చేశారు.

● రాయనపాడుకు బదిలీ

మొత్తం మీద ఈ వివాదం సమసిన క్రమంలో పర్సనల్ అధికారిని రాయనపాడు బదిలీ చేశారు. ఏ కారణం మీద బదిలీ చేశారన్నది మిస్టరీగా ఉంది. ఈ అధికారి వచ్చి నాలుగు నెలలు కూడా కాలేదు. విజయవాడలో అయితే అతని పోస్టు ప్రాధాన్యమైనది. అదే రాయనపాడు అయితే అంత ప్రాధాన్యత కాదు. ప్రాధాన్యత ఉన్న స్థానం నుంచి ప్రాధాన్యత లేని స్థానానికి ఎందుకు బదిలీ చేశారన్నది మిస్టరీగా మారింది. ఈ అధికారి బదిలీ వ్యవహారాన్ని జోన్ హెడ్డాఫీసులోని చీఫ్ ప్రిన్సిపల్ పర్సనల్ మేనేజర్ బదిలీకి ఆదేశించారని తెలుస్తోంది. దీంతో జీఎం బదిలీ ఆర్డర్స్ ఇచ్చారు. ఏ కారణంతో బదిలీ వేటు పడిందన్నది రైల్వే అధికారులు అత్యంత రహస్యంగా ఉంచారు.

● మళ్లీ రివర్స్ బదిలీ..

మళ్లీ అదే జీఎం ఆదేశాలతో రివర్స్ బదిలీ చేస్తూ కొద్ది రోజుల్లోనే ఆర్డర్ ఇచ్చారు. బదిలీకి కొద్ది కాలం ముందు ఈ అధికారి విజయవాడ డీఆర్ఎం బర్త్‌డే సెలబ్రేషన్స్‌ను గ్రాండ్‌గా నిర్వహించారు. ఒక డీఆర్ఎంకు బెజవాడలో ఈ స్థాయిలో ఓపెన్ గ్రౌండ్‌లో బర్త్‌డే సెలబ్రేషన్స్ ఎప్పుడూ జరగలేదు. ఈ బర్త్‌డే సెలబ్రేషన్స్ పెద్ద చర్చనీయాంశంగా మారాయి. ఈ అధికారి తిరిగి రావటానికి ఎవరు కారణమన్నది కూడా చర్చనీయాంశంగా మారుతోంది. ఈ అధికారి తమ మీద చూపించిన స్వామిభక్తితో ఏ ఉన్నతాధికారి సిఫార్సు చేశారన్నది చర్చనీయాంశమౌతోంది.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

- కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ



వైద్య అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఎంపీలాడ్స్, సీఎస్ఆర్ నిధులతో జిల్లాలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ అధికారులు ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ విభాగాల అధికారులతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న కమ్యునిటీ హాళ్లు, డిజటల్ లైబ్రరీలు, మైక్రోపిల్లర్లు, ఇతరత్రా భవనాల నిర్మాణపనులను పూర్తిచేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. ఆయా నిర్మాణాలకు సంబంధించిన నాణ్యతను అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. ఇకపై ప్రతి 15రోజులకోసారి జిల్లాలో అభివృద్ధిపనులపై పర్యవేక్షణ చేస్తానని, ఏ పనులు ఏ దశలో ఉన్నాయి.. వాటి పురోగతిపై పూర్తిస్థాయి సమాచారం అందించాలన్నారు. సమావేశంలో సీపీవో గణేష్, పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాల ఈఈలు ఏపీఎస్ శ్రీనివాస్, శివప్రసాద్, మత్స్యశాఖ అధికారి చంద్రశేఖరరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలను తగ్గించండి

జిల్లాలో మాతా, శిశు మరణాలను తగ్గించేందుకు వైద్యులు కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. మంగళవారం వైద్య, అనుబంధశాఖల అధికారులతో ఆయన సమీక్షాసమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇటీవల కాలంలో మాతా శిశుమరణాలకు సంబంధించిన కారణాలపై కలెక్టర్ ఆరా తీశారు. గర్భిణీలలో హైరిస్క్‌కేసుల విషయంలో వైద్యులు మరింత అప్రమత్తంగా ఉండి, ప్రాణనష్టం జరగకుండా అన్నిజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామ, వార్డు స్థాయిలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఎప్పటికప్పుడు గర్భిణీల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలసుకుని వైద్యులకు సమాచారం అందించాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రులలో గర్భిణులకు అవసరమైన మందులను అందజేయాలన్నారు. పోషకాహారంపై అవగాహన కల్పించాలన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, డీసీహెచ్ఎస్ పి.శ్రావణ్, వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు సమావేశంలో పాల్గొన్నారు.

పామాయిల్ సాగుపై.. అవగాహన కల్పించండి

మచిలీపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన కల్పించి సాగు విస్తీర్ణం పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో మంగళవారం ఉద్యాన, బిందు సేద్యం విభాగం అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ జేడీ జె జ్యోతి మాట్లాడుతూ గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు మండలాల్లో పామాయిల్ సాగు జరుగుతోందని, గత ఏడాదినుంచి చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ మండలాల్లోనూ ఈ సాగును రైతులు చేపట్టారని తెలిపారు. హెక్టారుకు 143 మొక్కలను ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని, ఐదో సంవత్సరంనుంచి పంట అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఏడాదికి ఎరువుల నిమిత్తం హెక్టారుకు రూ.5,200లను సబ్సిడీగా అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. బిందు సేద్యం విభాగం అధికారి విజయలక్ష్మీ మాట్లాడుతూ బిందుసేద్యంను ఉపయోగించే రైతులకు ఐదుఎకరాల్లోపు 90శాతం పరికరాల రాయితీలను ఇస్తున్నట్లు, ఐదుఎకరాలకు పైబడిన వారికి 50శాతం సబ్సిడీని ఇవ్వాల్సి ఉందన్నారు. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వంనుంచి మార్గదర్శకాలు విడుదల కావాలని ఆమె అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పామాయిల్ పంటను సేకరించే పంతంజలి, వేహన్ కంపెనీల ప్రతినిధులతో ఆయా ప్రాంతాలలో త్వరలో సమావేశాలు నిర్వహించి రైతులకు మరింతగా ఈ సాగుపట్ల అవగాహన కల్పించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. మండల, గ్రామస్థాయి అధికారులతో కలసి రైతులకు పామాయిల్ సాగుపై రైతులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

ఎన్నికల విధుల్లో పనిచేసిన సిబ్బందికి..

పారితోషికాలెప్పుడు?

- కొత్త ప్రభుత్వం కొలువు తీరి 30 రోజులు
- కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన ఓ అధికారి!
- పై అధికారులను అడగలేక బీఎల్‌వోలు బిక్కుబిక్కు
- త్వరలో తహసీల్దార్ల బదిలీ వార్తలతో మరింత ఆందోళన

జగ్గయ్యపేట : ఎన్నికల విధులు నిర్వహించిన కిందిస్థాయి సిబ్బంది, చిరుద్యోగులకు ఇవ్వాల్సిన పారితోషికాలు ఎన్నికల ప్రక్రియ ముగిసి, కొత్త ప్రభుత్వం కొలువు తీరి నెలరోజులైనా ఇవ్వకపోవటంతో గగ్గోలు పెడుతున్నారు. నియోజకవర్గంలో మొత్తం 222 పోలింగ్ స్టేషన్లు ఉండగా, ఎన్నికలకు వందల సంఖ్యలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ప్రత్యక్షంగా, పరోక్షంగా పనిచేశారు. పై స్థాయిలో పనిచేసిన కొందరు అధికారులకు కొంత మొత్తం దక్కినా, కిందిస్థాయిలో బీఎల్‌ఓలుగా పనిచేసిన వారికి రిక్తహస్తమే మిగిలింది. బీఎల్‌ఓలుగా పంచాయతీ సెక్రటరీలు, గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శి, కొన్నిచోట్ల అంగన్వాడీ వర్కర్లు, రెవెన్యూ సిబ్బంది పనిచేశారు. పోలింగ్ రోజున ప్రభుత్వ పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాల కోసం ఇచ్చిన రూ.5వేలు మినహా వారి సేవలకు ఎలాంటి పారితోషకం అందలేదు. ఎన్నికల కోడ్ వచ్చాక పూర్తిగా బాధ్యతలు బీఎల్‌వోలపైనే పడ్డాయి. ఎన్నికల కోసం నిద్రాహారాలు లేకుండా పాటు పడ్డారు. వీరితో పాటు ఈవీఎంను స్ట్రాంగ్‌రూంలకు తరలించటం, ప్రోగ్రామింగ్, పలు విడతల శిక్షణలో పాల్గొన్నారు. ఇంత పనిచేసినా కనీసం తమ సేవలకు గుర్తింపు లేకపోవటంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. బీఎల్‌వోలకు రెండు సంవత్సరాలుగా నెలకు రూ.500ల చొప్పున ఇవ్వాల్సిన గౌరవ వేతనం అందలేదు. ఎన్నికల రెండు రోజులకు రూ.250ల చొప్పున రూ.500ల మాత్రమే ఇచ్చారు. కంప్యూటర్ ఆపరేటర్లకు పారితోషకం అందలేదు. ఎన్నికల అధికారులు మాత్రం ఇంకా బడ్జెట్ రావాల్సి ఉందని చెప్పుకుంటు వాయిదాలు వేస్తున్నారు. వీరంతా చిరుద్యోగులు, వివిధ శాఖలకు చెందిన వారు కావటంతో గట్టిగా అడిగేందుకు సాహసించటం లేదు. వీరితో పాటు పోలింగ్ స్టేషన్‌లలో కరెంటు పనులు, కేటరింగ్, ఫోటోగ్రఫి, వీడియోగ్రాఫర్లకు సంబంధించిన బిల్లుల కోసం కార్యాలయాల చుట్టు తిరుగుతున్నట్టు సమాచారం. కొద్ది రోజుల్లో తహసీల్దార్ల బదలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులు వెళ్లిపోతే తమ పరిస్థితి ఏంటని వారు వాపోతున్నారు. బీఎల్‌వోలు, పోలింగ్ రోజున హమాలీలుగా పనిచేసిన గ్రామ సేవకులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఎన్నికలు అందరికి పండుగలా జరిగితే తమకు మాత్రం అన్ని రకాలుగా ఇబ్బంది పడ్డామని వాపోతున్నారు. నియోజకవర్గంలో కీలకంగా పనిచేసిన ఒక అధికారి తన బిల్లులు రాలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. పెద్ద అధికారులు కలెక్టర్‌ను కలిసి చెప్పుకుంటారని, తమ పరిస్థితి ఏమిటని చిరుద్యోగులు మదన పడుతున్నారు. ఈ విషయమై జగ్గయ్యపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా పనిచేసిన జి.వెంకటేశ్వర్లును ఫోన్‌లో సంప్రదించగా, బిల్లులు రాలేదని కొంత మంది తనకు ఫిర్యాదు చేశారని, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన బిల్లులు ఏఈఆర్వోగా వ్యవహరించిన జగ్గయ్య పేట తహసీల్దార్ శేషు ద్వారా వస్తాయని, కొన్ని బిల్లులు పెండింగ్ ఉన్నాయని చెప్పారు. తహసీల్దార్ శేషును వివరణ కోరగా కొన్ని బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, బడ్జెట్ కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు. బీఎల్‌ఓల ఎంత ఇవ్వాల్సింది లెక్క చూడాల్సి ఉందని చెప్పారు.



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వండి

- జేసీకి యూటీఎఫ్ వినతి

గవర్నర్‌పేట : ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరుతూ మంగళవారం యూటీఎఫ్ జిల్లా ప్రతినిధులు, జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అన్ని జిల్లాల్లో ఇప్పటికే డ్యూటీ సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో అందజేశారని, ఇక్కడ మాత్రం ఇవ్వలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, సుందరయ్య, రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్‌కుమార్, జిల్లా సహాధ్యక్షుడు కృష్ణయ్య పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	208
చికెన్ స్కిన్‌లెస్	218

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.55

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

బోళ్లపాడు(ఉయ్యూరు), జూలై 16 : భూయజమాని సంతకంతో సంబధం లేకుండా కౌలు రైతులం దరికీ గుర్తింపు కార్డులి వ్వాలని కౌలురైతు సంఘం నాయకుడు ఆకావరపు తిరుపతయ్య ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు. కౌలు రైతులం దరికి గుర్తింపు కార్డులివ్వాలని కోరుతూ సంఘం చేపట్టిన సంతకాల సేకరణలో భాగంగా మంగళవారం బోళ్లపాడులో పర్యటించి కౌలు రైతుల సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వకపోవడంతో బ్యాంకుల నుంచి అప్పులు తీసుకోలేక బయట అధిక వడ్డీకి తీసుకుని నష్టాల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కౌలు రైతులందరికి గుర్తింపు కార్డులిచ్చి బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు వంక పూర్ణచంద్రరావు, సీఐటీయూ నాయకుడు బి.రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీలక్ష్మీవేంకటేశ్వస్వామి ఆలయంలో పూజలు

ఘనంగా ఛండీహోమం

హనుమాన్‌జంక్షన్, జూలై 16 : స్థానిక నూజి వీడు రోడ్డు శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆషాఢ మాసం పురస్కరించుకొని ఆదివారం నుంచి నిర్వహిస్తున్న ఛండీహోమం మంగళవారంతో ముగి సింది. ఆలయ అర్చకులు చక్రావధానుల సీతారా మాచార్యులు ఆధ్వర్యంలో హోమం ఘనంగా నిర్వ హించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ట్రస్టీ తవ్వా పూర్ణచంద్రరావు దంపతులు హోమాన్ని జరిపారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ఈవో వై.శ్రీనివాస్ పర్యవేక్షించారు.

అభయాంజనేయస్వామికి పూజలు

స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం పురస్కరించుకొని స్వామి వారిని ప్రత్యే



ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు చేస్తున్న దాతలు

కంగా అలంకరించి ఘనంగా పూజలు నిర్వహించారు. స్వామికి మంగళవారం ప్రీతికరం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు ఆలయాన్ని సందర్శించారు. ఈ సంద ర్భంగా స్థానిక గుడివాడ రోడ్డుకు చెందిన పర్వతనేని వెంకటేశ్వరరావు ప్రభావతమ్మ కుటుంబ సభ్యులు 400 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈవో కె.శ్రీనివాస్, ఆలయ అర్చకులు, సిబ్బంది కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

9 మంది జూదరుల అరెస్టు

గన్నవరం, జూలై 16 : పేకాట శిబిరంపై దాడి చేసి తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం అర్ధరాత్రి మర్లపాలెం శివారులోని బృందా వనం గార్డెన్‌లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం రావటంతో ఎస్సై శివప్రసాద్ సిబ్బందితో కలసి వెళ్లి దాడి చేశారు. తొమ్మిది మంది జూదరులతో పాటు రూ. 50,350 నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న తుమ్మల చంద్రశేఖరరావు, విజయలక్ష్మి దంపతులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 16 : సింగన్న గూడెంలో పునర్నిర్మిస్తున్న శ్రీగంగాపార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయానికి రేమల్లెకు చెందిన తుమ్మల చంద్ర శేఖరరావు, విజయలక్ష్మి దంపతులు విరాళం అందజేశారు. సింగన్నగూడెంలో ఆలయ కమిటీ సభ్యులకు రూ. 51, 116 విరాళాన్ని మంగళ వారం అందజేశారు. అర్చకులు నాగేశ్వరశర్మ దాతలతో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసా దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బెజవాడ వెంకటకృష్ణారావు, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణ, రాజా, చిన్నాల బోసు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ ప్రారంభం

గన్నవరం, జూలై 16 : ఆధునిక విద్య వ్యవస్థ లో థింకింగ్, ప్రాబ్లం సాల్వింగ్ స్కిల్స్‌కు అత్యధిక ప్రాధాన్యత ఉందని మౌంట్‌ఫోర్టు హైదరాబాద్ ప్రావి న్షియల్ సుపీరియర్ రెవరెండ్ బ్రదర్ షైన్ అలెక్స్ అన్నారు. స్థానిక వీఎస్ సెయింట్ జాన్స్ పాఠశాలలో ఆర్టిఫిషి యల్ ఇంటెలిజన్స్ ల్యాబ్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిజిటల్ అక్షరాస్య తలో బలమైన పునాదులు నిర్మించాలన్నారు. ఆధునిక అవసరాల ఏఐ సంబంధిత సబెక్టులను పాఠ్యాం శాలుగా జతచేయా లని భవి ష్యత్‌కు సరిగ్గా సిద్ధమయ్యేం దుకు ఏఐ వంటి వాటిని అందిపుచ్చు కోవాలన్నారు. ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, జూలై 16 : మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఈడుపుగల్లు పరిధి లో జాతీయ రహదారి పక్కన మంగళవారం ఆయ న మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ, గత ప్రభుత్వ హయాంలో చెట్లు నరకడమే పనిగా వైసీపీ నాయకులు పెట్టుకున్నారని, పోరంకి నుంచి ఈడుపుగల్లు వరకు రోడ్డు మధ్యలో ఉన్న అనేక చెట్లను గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొట్టివేయడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చిన నెల రోజులో నే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల నపై దృష్టి పెట్టారన్నారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్క టికీ నెరవేరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ మైథిలి, మాజీ ఎంపీపీ దేవినేని రాజా, సర్పంచ్ పందిపాటి ఇందిర, జనసేన



ఈడుపుగల్లులో జాతీయ రహదారి పక్కన మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

సమన్వయకర్త ముప్పా రాజా, మాజీ సర్పంచ్ షేక్ బాబు సుబాని, పార్టీ నాయకులు సుదిమళ్ల రవీంద్ర, అనుమోలు ప్రభాకరరావు, సెంగెపు రంగారావు, చెల్లి సంగీతరావు, సుధాకర్, పుట్టగుంట రవి, ఉపసర్పంచ్ కిలారు శ్రీనివాసరావు, సుంకర శ్రీహరి, అనుమోలు రామ కృష్ణ, దుర్గా భవాని, షేక్ షకార్, బాజీబీ, చిన్నబాబు, షేక్ శ్రీను, ముసల య్య, నందమూరి మాధవరావు, ప్రవీణ్, బాబూజి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



రహదారి మరమ్మతు పనులను పరిశీలిస్తున్న దేవినేని రాజా

ఈడుపుగల్లు - ఉప్పలూరు రహదారికి మరమ్మతులు

స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చొరవ తో ఈడుపు గల్లు - ఉప్పలూరు ప్రధాన రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టినట్లు మాజీ ఎంపీపీ దేవినేని రాజా తెలిపారు. ఈడుపుగల్లు - ఉప్పలూరు ప్రధాన రహదారి మరమ్మతులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దేవినేని రాజా మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో ప్రధాన రహదారులు, అంతర్గత రహదారుల పరిస్థితి అధ్వా నంగా మారాయన్నారు. ఈడుపుగల్లు - ఉప్పలూరు ప్రధాన రహదారి అధ్వానంగా ఉందంటూ స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ దృష్టికి తీసుకు వెళ్లగా స్పం దించిన ఆయన తక్షణం మరమ్మతులకు అవసర మైన చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. దీంతో బోడె ప్రసాద్ తీసుకున్న చర్యలతో గ్రామ స్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పందిపాటి ఇందిర, వార్డు సభ్యురాలు సుంకర సుగుణ, టీడీపీ నాయకులు దేవినేని రత్నభూషణ్, పందిపాటి సుధాకర్, సాంబయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కుష్టువ్యాధిపై అవగాహన కల్పిస్తున్న ఎన్ఎల్ఈపీ నోడల్ పర్సన్ అంకూరి

కుష్టువ్యాధిని సమూలంగా నిర్మూలించాలి

ఉంగుటూరు, జూలై 16 : కుష్టువ్యాధి నిర్మూలన అందరి లక్ష్యం కావాలని, కుష్టువ్యాధి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఆరోగ్య కార్యకర్త కృషి చేయాలని ఆత్కూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ బి.మనోహర్‌రెడ్డి, డాక్టర్ టి.జితేంద్రకు మార్ పిలుపు నిచ్చారు. జాతీయ కుష్టువ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆత్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో కుష్టువ్యాధి లక్ష ణాలు వున్న వారిని గుర్తించడం, మెరుగైన వైద్యసేవలు అందించడంపై ఆరోగ్య కార్యకర్తలకు శిక్ష ణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ, కుష్టువ్యాధిని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో ఈనెల 18నుంచి ఆగస్టు 2వతేదీ వరకు ఇంటింటా సర్వేను పకడ్బందీగా నిర్వహించనున్నట్లు తెలిపా రు. ఎన్ఎల్ఈపీ నోడల్ పర్సన్ అంకూరి నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ, కుష్టు వ్యాధి మైకో బాక్టీరియం లెప్రే అనే బాక్టీరియా వల్ల వస్తుందని, ఈ క్రిములు తుమ్మడం, దగ్గ డం, గాలిద్వారా రోగినుంచి వేరొక రికి వ్యాప్తిచెందు తాయని తె లిపారు. ఈ కార్య క్రమంలో ఎంపీ హెచ్ఈవో సీహెచ్ సాంబశి వరాజు, పీహెచ్ యన్, బీవీ ఎంపీ కుమారి పాల్గొ న్నారు.

రద్దు చేసిన సర్వీసులు ప్రారంభించాలి

ఆర్టీసీ డిపో గ్యారేజ్ గేటు ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు



ఎస్ఎంయుఏ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న కార్మికులు

ఉయ్యూరు, జూలై 16 : డిపో ఏఎం(టి) పక్షపాత వైఖరి విడనాడి కార్మికుల అందరి పట్ల ఒకే విధంగా అనుసరించాలని, సమస్యలు పరిష్కరించి, డిపో పరిధిలో పూర్తి స్థాయి రూట్లలో సర్వే జరిపి రద్దుపరచిన సర్వీసులన్నింటిని తిరిగి ప్రారంభించాలని కోరుతూ ఎస్ఎంయుఏ ఆధ్వర్యంలో కార్మికులు ఎర్ర రిబ్బన్లు ధరించి ఉయ్యూరు ఆర్టీసీ డిపో గ్యారేజి గేటు ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. డిపో ఏఎం(టి) కార్మికుల పట్ల అవలంభిస్తున్న పక్షపాత వైఖరి నిలుపుదల చేయాలని పలుమార్లు డిపో అధికారికి వినతిపత్రం అందజేసినా ఫలితం లేదని అసోసియేషన్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. 9 సంవత్స రాలుగా ఏడీసీ షఫిలింగ్ చేయడం లేదని, అక్రమ ఓడీలు రద్దుపరచి సీనియారిటీ ప్రాతిపదికన ఓడీలు కేటాయించాలని, పూర్తిస్థాయిలో రూట్ సర్వే జరపి రద్దుప రచిన సర్వీలన్నీ తిరిగి ప్రారంభించాలని నాయకులు డిమాండ్ చేశారు. సర్వీసు లు రద్దుచేసి కార్మికులకు బలవంతంగా శెలవులు ఇవ్వడం మానుకోవాలని, చార్టులో బ్లాంకులు పూరించాలని, 281 చార్టు బుకింగ్ సీనియారిటీ ప్రకారం బుక్ చేయాలన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శిని నిబంధనలకు విరుద్ధంగా దీర్ఘకాలంగా కార్గో సర్వీసు పాయింట్‌లో ఉంచుతూ అక్రమ ఓడీల కు అధిక ప్రాధాన్యత నిస్తున్నారని ఆరోపించారు. గ్యారేజిలో అవసరమైన స్పేర్ పార్టులు, టూల్స్ సప్లయి చేసి తద్వారా వెహికల్ కండిషన్ మెరుగుపరచాలని, మహిళా ఉద్యోగుల స్టాఫ్ రూముల్లో కనీస సదుపాయాలు కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు.

డయేరియాపై అవగాహన

ఉయ్యూరు, జూలై 16 : డయేరియా, సీజనల్ వ్యాధు లపై అవగాహన కల్పిస్తూ ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల ఎన్ ఎస్ఎస్ వలంటీర్లు మంగళ వారం యాకమూరులో ప్రద ర్శన నిర్వహించారు. ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కె.శేఖర్ బాబు, టి.నరసింహా రావు, ఎండీ నూర్ ఆధ్వర్యంలో కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలో ప్రజలను కలసి డయేరియా వ్యాధి లక్షణాలు, తీసుకోవాలిసిన జాగ్రత్తలు తెలి యజేశారు. పరిసరాల పరిశుభ్రత, కాచి సల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు.



డయేరియాపై అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ఆయుర్వేద వైద్యంపై అవగాహన

గన్నవరం, జూలై 16 : ఆయుర్వేద వైద్య విధానంపై ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించటమే గాక ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామని డాక్టర్ పి.మల్లికార్జునరావు, బి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక రోటరీ ఆడిటోరియంలో గూడవల్లి ప్రభుత్వ ఆయూష్ ఆస్పత్రి, రోటరి క్లబ్ ఆఫ్ గన్నవరం సంయుక్తంగా మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, ఆయుర్వేదంపై అపోహలు వీడి రుగ్మతలకు మంచి మందులు వాడి ఉత్తమ ఫలితాలు పొందవచ్చునని తెలిపారు. రక్తపోటు, మధుమేహం, మోకాళ్ల నొప్పులు, థైరాయిడ్, మూత్ర విసర్జన సమస్యలు గ్యాస్ అజీర్ణం కాళ్ల తిమ్మిర్లు వాపులు తదితర జబ్బులకు చికిత్సలు చేసి వందమందికి మందులు అందజేశారు. ఫార్మసిస్టు పి.కోటేశ్వర రావు, యోగా టీచర్‌లు వి.స్వాతి, పీహెచ్ చైతన్య రోటరీ క్లబ్ అధ్యక్షుడు టీఎస్ఆర్‌కె ప్రసాద్, కార్యదర్శి జీవీ రవిబాబు, మాజీ అధ్యక్షుడు జాస్తి విజయ భూషణ్‌కుమార్ రోటరీయన్‌లు గూడపాటి త్రివేది, కాసన్నేని బాబూరావు, పివిఎస్ రామబ్రహ్మం, చిగురుపాటి మార్గబంధు, న్యాయవాది జాస్తి తాతారావు, నాదిండ్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పి.మల్లికార్జునరావు

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 16 : తక్కువ నీటియాజమాన్యంతో, చీడపీడల బెడద లేకుండా నిరంతర ఆదాయం ఇచ్చే ఆయిల్‌పామ్ సాగుతో అధికలాభాలు ఆర్జించవచ్చని ఉద్యానవనశాఖ అధికారి హరిశ్చంద్ తెలిపారు. రంగన్నగూడెంలో మంగళవారం ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సహకారంతో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిం చారు. వంటనూనెల ఉత్పత్తిలో స్వయం సంవృద్ధి సాధించేందుకు కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమంగా ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. ఒక్కసారి మొక్క నాటిన తరువాత 3సంవత్సరాల వరకు అంతర పంటల ద్వారా ఆదాయం పొందవచ్చని, తరు వాత 30 సంవత్సరాల వరకూ ఆయిల్‌పామ్ దిగుబడితో నిరంతరం ఆదాయం వస్తుందన్నారు. మొక్క కొనుగోలు నుంచి నాటేందుకు, తరువాత అంతర పంట లకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని, ప్రభుత్వం అందించే సబ్సిడీ నేరుగా రైతు ఖాతాల్లో జమచేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, వీహెచ్ఏ సంధ్య, పతంజలి ఫుడ్స్ మేనేజర్ శరత్, రైతులు పాల్గొన్నారు.

సాగుపై చిన్నచూపేల!

- రెండేళ్లగా డిప్యుటేషన్‌పై కొనసాగుతున్న వ్యవసాయాధికారి
- ఏళ్ల తరబడి భర్తీకి నోచుకోని వ్యవసాయ విస్తరణాధికారి పోస్టులు
- సాగుపై అవగాహన కల్పించేవారులేక ఆందోళన చెందుతున్నరైతులు



గన్నవరం వ్యవసాయ శాఖ కార్యాలయం

గన్నవరం, జూలై 16 : ఐదేళ్ల వైసీపీ పాలన రైతులకు శాపంగా మారింది. పంటల సాగుపై అవగాహన కల్పించే వ్యవసాయాధికారులు అందు బాటులో లేక రైతులు ఇబ్బంది పడుతున్న పరిస్థితి నియోజకవర్గ కేంద్రమైన గన్నవరం మండలంలో నెలకొంది. కొంతకాలంగా వ్యవసాయశాఖలోని కీలక అధికారుల పోస్టులు భర్తీకి నోచుకోలేదు. మండల వ్యవసాయాధికారి పోస్టుతోసహా రెండు వ్యవసాయ విస్తరణాధికారుల (ఏఈఓ) పోస్టులు కూడా ఖాళీ గానే ఉన్నాయి. ఫలితంగా మండలంలో వ్యవసాయ శాఖ పనితీరుపై రైతాంగం పెదవి విరుస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయాధికారిగా ఉన్న తేజస్విని రెండేళ్ల క్రితం మచిలీపట్నంలోని అగ్రి లేబొరేటరీకి బదిలీపై వెళ్లారు. అయినప్పటికీ, ఆమె డిప్యుటేషన్‌పై గన్నవరం ఏఓగా కొనసాగుతున్నారు. మరోవైపు మండలంలో రెండు ఏఈఓ పోస్టులుం డగా, ఒక పోస్టు ఏళ్ల తరబడి భర్తీకి నోచుకోవడం లేదని, మరో ఏఈఓకు ఏఓకు మధ్య సత్సంబంధాలు లేకపోవడం తో ఏఈఓ బదిలీపై వెళ్లిపోయారు. దీంతో మండ లానికి సంబంధించిన వ్యవసాయ సంబంధిత పనులు పెండింగ్ పడుతున్నాయి. కాగా, రోజువారీ కార్యకలాపాల నిర్వహణ కోసం గన్నవరం - 1 సచి వాలయం గ్రామ వ్యవసాయ సహాయకుడు (వీఏఏ) సేవలను వినియోగించుకుంటున్నారు. మండలం లోని 21 గ్రామ పంచాయతీలలో సుమా రు 18 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో సుమారు ఏటా 15 వేల ఎకరాలలో వరి సాగు చేస్తుండగా, మరో మూడు వేల ఎకరాలలో పత్తి, వేరుశెనగ, మినుము, పెసర, మొక్కజొన్న వంటి వాణిజ్య పంటలతోపాటు చెరుకు సాగవుతోంది. 15 వేల ఎకరాల వరి ఆయ కట్టులో మెజార్టీ ఆయకట్టు చెరువుల కందే ఉంది. ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లో వ్యవసాయ శాఖ అధికా రుల సలహాలు సకాలంలో అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	208
చికెన్ స్కిన్‌లెస్	218

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.55

అర్హులైన వారికి టిడ్కో ఇళ్లు అందజేస్తా : ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ : గత వైసీపీ ప్రభుత్వం చేసిన అవినీతిని అరికట్టి, అర్హులైన వారికి టిడ్కో ఇళ్లను అప్పగిస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హామి ఇచ్చారు. తనకు కేటాయించిన టిడ్కో ఇంటిని అప్పగించాలంటూ స్థానిక 28వ వార్డుకు చెందిన బొడ్డు అలీసమ్మ మంగళవారం ప్రజావేదికలో ఎమ్మెల్యేను కలిసి కోరారు. డబుల్ బెడ్ రూంకు నగదు చెల్లించినా, గత ప్రభుత్వం లబ్దిదారులకు ఇళ్లను అప్పగించలేదని, నిజమైన లబ్దిదారుల నివేదికను సిద్ధం చేస్తున్నామని, బాధితులెవ్వరూ ఆం దోళన చెందవద్దని, వారికి న్యాయం చేస్తానని ఎమ్మెల్యే రాము హామి యిచ్చారు.

50 పడకలకు చల్లపల్లి ఆసుపత్రి

• ప్రతిపాదనలకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఆదేశం

చల్లపల్లి, జూలై 16 : చల్లపల్లి కమ్యూనిటీ ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. బాలింతలు, గర్భిణీలు, రోగులను పలకరించి వారికి అందిస్తున్న చికిత్సలపై ఆరాతీశారు. ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరంగం శ్రీనివాసరావు, డాక్టర్ మహేష్‌లతో సమావేశమై ఆసుపత్రి అవసరాలపై చర్చించారు. ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా ప్రమోట్ చేసేందుకు అనువుగా ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. తగిన సంఖ్యలో వైద్యులను, సిబ్బందిని నియమించేలా కృషి చేసి ఆసుపత్రిని మరింత వృద్ధిలోకి తెస్తామన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఆసుపత్రిలో పాముకాటు ఇంజక్షన్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని వైద్యులు తెలిపారు. గ్రామాల్లో ప్రజలు అతిసార బారిన పడకుండా కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. అతిసార లక్షణాలతో బాధపడుతూ ఉంటే ప్రభుత్వ ఆసుపత్రుల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన చికిత్స అందుబాటులో ఉందనీ, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



చల్లపల్లి ఆసుపత్రిలో బాలింతతో మాట్లాడుతున్న బుద్ధప్రసాద్



కోడూరు పీహెచ్‌సీని సందర్శిస్తున్న ఎమ్మెల్యే మండలి

అగ్నిప్రమాద బాధితులకు ఎస్టీ కార్పోరేషన్ సాయం

చల్లపల్లి : నారాయణరావునగర్ ఎస్టీ కాలనీ అగ్ని బాధిత గరికపాటి యశోదకు రూ.50 వేలు, కుంభా వెంకయ్యకు రూ.20 వేల చెక్కులను ఆయన అందజేశారు. గరికపాటి యశోదకు పక్కా గృహ నిర్మాణానికి రూ.1.80 లక్షలు, కార్పొరేషన్ ద్వారా ప్రత్యేక సహాయం రూ.63 వేలు, లబ్ధిదారుని వాటా రూ.27 వేలతో పక్కాగృహం మంజూరు చేసినట్లు తెలిపారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీపీ కోట విజయరాధిక, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో బూరేపల్లి అశోక్, సీనియర్ అసిస్టెంట్ శ్యాంసన్, కార్యదర్శి పి.వి.మాధవేంద్రరావు, శ్రీకాకుళం సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్, జనసేన నేతలు బొందలపాటి వీరబాబు, అడపా రవి తదితరులు పాల్గొన్నారు. నారాయణరావునగర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంకు పనులను పరిశీలించారు. జలజీవన్ మిషన్‌లో జరిగిన పనులు, పైపులైన్ ఏర్పాటు, తాగునీటి సరఫరా అంశాలపై సుర్పంచ్, అధికారులతో చర్చించారు. ఆర్‌డబ్ల్యుఎస్ డీఈతో ఫోన్‌లో మాట్లాడి తగు సూచనలు చేశారు.

కోడూరు పీహెచ్‌సీ తనిఖీ

కోడూరు : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా ఎమ్మెల్యే తనిఖీ చేశారు. పాముకాటు, కుక్కకాటు వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయో లేదో పరిశీలించారు. ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద మురుగునీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు పాటించి, కాచి చల్లార్చిన నీటిని తాగుతూ పలు జాగ్రత్తలు పాటించాలని కోరారు. పీహెచ్‌సీలో వైద్య సదుపాయాలన్ని అందుబాటులో ఉండటంతో సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు బండే శ్రీనివాసరావు, బచ్చు వెంకటేష్, పిల్లి మల్లిఖార్జునరావు, గోగినేని సోమశేఖరరవు, ముద్దినేని చంద్రరావు, మేడా శివాజీ, బండే వెంకటేశ్వరరావు, స్థానిక పార్టీ నేతలు పాల్గొన్నారు.



మచిలీపట్నం సమీపంలోని గోల్డ్ కన్వెన్షన్ హాలులో నిత్య పూజావిధానంపై ప్రసంగిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

ధర్మ మార్గంతోనే భగవత్ కృప

• నిత్యం భగవతారాధనతోనే కష్టాలు కడ తేరేది : చాగంటి కోటేశ్వరరావు

మచిలీపట్నం టౌన్, జూలై 16 : ధర్మమార్గాన్ని అనుసరించే వారికి భగవత్ కృప ఎప్పుడూ ఉంటుందని ప్రవచన చక్రవర్తి, శారదా జ్ఞానపుత్ర చాగంటి కోటేశ్వరరావు అన్నారు. హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో గోల్డ్ కన్వెన్షన్ హాలులో నిత్య పూజా విధానంపై మంగళవారం చాగంటి కోటేశ్వరరావు ప్రసంగించారు. కష్టాలు వస్తేనే భగవంతుడిని ఆరాధించడం సరికాదని, నిత్య భగవదారాధనతో కష్టాలు వైదొలగిపోతాయన్నారు. ఇందుగలడు అందులేడంటూ భాగవత, భారత, రామాయణంలోని ఇతి వృత్తాలను చాగంటి వివరించారు. సృష్టి క్రమంలో మానవజన్మకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ఊపిరి ఉన్నంత కాలం తోటి వారికి సాయం చేయడం, భగవంతుడిని ఆరాధించడం చేయాలన్నారు. ఈశ్వరుని కృప ఉన్నంత కాలం ఏ దుష్ట శక్తి మనల్ని ఏమీ చేయదన్నారు. కృతజ్ఞతా భావానికి మానవుడిగా అవతరించిన రాముడు ఉదాహరణగా మిగిలిపోతాడన్నారు. రెండు రోజుల పాటు సాగే ఈ ప్రవచన కార్యక్రమాలకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. చాగంటి రాకతో మచిలీపట్నంలో ఆధ్యాత్మిక భావన వెల్లివిరిసింది. హిందూ ఐక్యవేదిక ప్రతినిధులు రామాం జనేయులు, మద్దుల గిరీష్, మోటమర్రి బాబాప్రసాద్ తదితరులు చాగంటి కోటేశ్వరరావును దుశ్శాలువాతో సత్కరించి ఆహ్వానించారు. వేదప్రవచనంతో వేదపండితులుస్వాగతించారు. నగర కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు, టీడీపీ నాయకులు కొనకళ్ల బుల్లయ్య, మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ కోటేశ్వరరావును వేదికపైకి ఆహ్వానించారు. సాహి తీవేత్త కేతవరపు శికుమార్ కోటేశ్వరరావును సభా వేదికపైకి ఆహ్వానించి ఘనంగా సత్కరించారు.

సభ్యత్వ నమోదుతో జనసేన పార్టీ మరింత పటిష్టం



మచిలీపట్నం టౌన్, జూలై 16 : జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పిలుపు మేరకు పార్టీ సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని జనసేన నియోజక వర్గం ఇన్‌చార్జి బండి రామకృష్ణ అన్నారు. జనసేన పార్టీ నాయకుల విస్తృత సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. ఈనెల 18 నుంచి 25 వరకు క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. క్రియాశీలక సభ్యత్వ నమోదుకు ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డుల స్టాట్‌లతో పాటు రూ.500 చెల్లించాలన్నారు. క్రియాశీల సభ్యులకు రూ.5 లక్షల జీవిత బీమా రూ.50 వేల ప్రమాద బీమా పొందవచ్చన్నారు. నాయకులు, కార్యకర్తలు తమ పరిధిలో పర్యటించి సభ్యత్వం నమోదుపై డ్రైవ్ చేయాలన్నారు. గడ్డం రాజు, సర్పంచ్ బొమ్మసాని నరేష్, నాయకులు పినిశెట్టి వేణు, శాయన శివ, జి.వాసు, వడ్డి చిరంజీవి, ఈవన మణిబాబు, ఊచ చంటి, పృథ్వి, విన్నకోట శ్రీకాంత్, సురేష్, సాయి, బి.పవన్, తోట రాజేష్ పాల్గొన్నారు.

చిలకలపూడి హైస్కూల్‌కు మంత్రి రవీంద్ర ఫ్యాన్లు వితరణ



మచిలీపట్నం టౌన్ : చిలకలపూడి మునిసిపల్ హైస్కూలుకు మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం 15 ఫ్యాన్లను బహూకరించారు. మంత్రి ఇటీవల చిలకలపూడి హైస్కూలుని సందర్శించిన సమయంలో విద్యార్థులు ఫ్యాన్లు తిరగడం లేదని చెప్పారు. దీనిపై మంత్రి స్పందించారు. కొల్లు ఫౌండేషన్ ద్వారా ఫ్యాన్లు కొని మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్‌కు ఇచ్చి పంపారు. బాబాప్రసాద్, పంచపర్వాల కాశీవిశ్వనాథం, ఎండీ ఇలియాస్ బాషా విద్యార్థులకు ఫ్యాన్లను అందజేశారు. ఆలపాటి సురేష్, ప్రధానోపాధ్యాయుడు యు.వి.కృష్ణమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయుడు వి. రమేష్, వంకా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకులు వెంకట్రామయ్య మృతి



మోపిదేవి : పెదప్రోలు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు నాదెళ్ల వెంకట్రామయ్య మంగళవారం తెల్లవారుజామున విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన సతీమణి నాదెళ్ల రమాదేవి పెదప్రోలు పంచాయతీ సర్పంచ్‌గా పని చేశారు. పార్టీకి, గ్రామాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన వెంకట్రామయ్య మృతి పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సర్పంచ్ పోలిమెట్ల ఏసుబాబు, పార్టీ నాయకులు నాదెళ్ల శరత్ చంద్రబాబు తదితరులు వెంకట్రామయ్య మృతి పట్ల సంతాపం తెలియజేశారు.

వీనుల విందుగా గాత్ర కచేరీ



మచిలీపట్నం టౌన్ : హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో గోల్డ్ కన్వెన్షన్ హాలు వద్ద మంగళవారం రాత్రి ప్రముఖ గాయనీ మణులు సింగరాజు కళ్యాణి, కాళీపట్నపు ఉమ తదితరులు అన్నమయ్య, త్యాగరాజు కీర్తనలు మృదు మధురంగా గానం చేశారు. చాగంటి కోటేశ్వరరావు గాయనీ మణులను అభినందించారు.పాలపర్తి నాగేశ్వరరావు వయొలిన్‌పై సహకరించారు. కళాకారులను నిర్వాహకులు రామాంజనేయులు ఘనంగా సత్కరించారు.



శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలతో యూనియన్ బ్యాంకు మేనేజర్ వెంకట్రావు

జూట్ బ్యాగుల తయారీతో ఉపాధి

ఘంటసాల : ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకుని జ్యూట్ బ్యాగుల తయారీ ద్వారా ఉపాధి పొందవచ్చునని చల్లపల్లి యూనియన్ బ్యాంక్ మేనేజర్ పి.వెంకట్రావు తెలిపారు. చిట్టూర్పులో చల్లపల్లి యూనియన్ బ్యాంక్, భారత ప్రభుత్వ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ పట్టాభి గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో 35 మంది మహిళలకు 13 రోజులపాటు జ్యూట్ బ్యాగుల తయారీపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ ముగింపు సందర్భంగా మహిళలు తయారు చేసిన నార సంచులను ప్రదర్శించారు. డాక్టర్ పట్టాభి సంస్థ డైరెక్టర్ ఎం.గోపినాథ్ మాట్లాడుతూ శిక్షణ పొందిన డ్వాక్రా గ్రూపు సభ్యులకు స్వయంఉపాధికి లఘు పరిశ్రమ నిర్వహించుకునేలా ప్రోత్సాహంగా బ్యాంకుల నుంచి రుణ సదుపాయం వస్తుందన్నారు. టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు గుత్తికొండ వరప్రసాద్, గ్రామ ఉప సర్పంచ్ గుత్తికొండ రాజ్యలక్ష్మి, బ్యాంక్ అధికారి ఎన్.శ్రీరామ్, శిక్షకులు రమేష్ పాల్గొన్నారు.

అవనిగడ్డ, మోపిదేవి మండలంలో ఎరువుల దుకాణాల తనిఖీ

అవనిగడ్డ : అవనిగడ్డలోని ఎరువుల దుకాణాలను గన్నవరం ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు, ఏవో వి.శౌరమ్మ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువులు ఎక్కువ ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీలర్లను వారు హెచ్చరించారు. దుకాణంలో స్టాకు పరిశీలించారు. నాణ్యమైన ఎరువులను విక్రయించాలన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. మోపిదేవి : ఎరువులు పురుగు మందుల దుకాణదారులు ప్రతి రోజు స్టాక్ రిజిష్టర్లు విధిగా నమోదు చేయాల్సిందిగా గన్నవరం ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. స్టాక్ తేడాలు ఉంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు మండల వ్యవసాయ శాఖాధికారి హెప్సిబా, సహాయక ఉద్యోగులు పాల్గొన్నారు

కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయాలి

చల్లపల్లి : గ్రామాల్లో సమస్యలను గుర్తించి పరిష్కారం చేస్తే గ్రామీణ ప్రాంతాల్లో కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయ వచ్చని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోసూరి శివనాగేంద్రం అన్నారు. గుంటూరు బాపనయ్య శ్రామిక భవనంలో మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి అందరం సమైక్యంగా ఉద్యమించాలని సూచించారు. దోపిడీ వర్గాలపై పోరాటం చేసి సామాజిక న్యాయం కోసం కృషి చేయాలన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యులు ఆర్‌సిపి.రెడ్డి, మండల కార్యదర్శి యద్ధనపూడి మధు, సీఐటీయూ మండల కార్యదర్శి ఎండి.కరీముల్లా పాల్గొన్నారు.

అధికారులు గుడ్లవల్లేరు కొత్త కాలనీ సందర్శన

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

గుడ్లవల్లేరు : అంతర్గత రహదార్లు అధ్వానం శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీవో డి.ఎస్ నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్, హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈ సురేంద్ర కాలనీని పరిశీలించారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదేశం మేరకు వర్షం తగ్గిన వెంటనే కాలనీలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని చెప్పారు.



చిన్నారులపై అత్యాచారాలను ఖండిస్తూ ర్యాలీ

గుడ్లవల్లేరు : చిన్నారులపై అత్యాచారాలను ఖండిస్తూ మంగళవారం స్థానిక శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. గంజాయి నివారించాలని, ఆడపిల్లలకు రక్షణ కల్పించాలని ప్లకార్డులతో చిన్నారులు ప్రదర్శనలో పాల్గొన్నారు.పాఠశాల కరస్పాండెంట్ సింగంశెట్టి ఆదినారాయణ నేతృత్వం వహించారు.



వృద్ధాశ్రమ నిర్మాణానికి షిర్డిసాయి సేవాసంస్థ విరాళం

చల్లపల్లి : నిమ్మలతోట సీయోను వృద్ధాశ్రమ భవన నిర్మాణానికి విజయవాడ షిర్డి సాయి సేవా సంస్థ సభ్యులు రూ.40వేల విరాళాన్ని అందించారు. చల్లపల్లి ఉపసర్పంచ్ ముమ్మనేని నాని ద్వారా ఆశ్రమ నిర్మాణ విషయం తెలుసుకున్న ట్రస్ట్ సభ్యులు మంగళవారం చల్లపల్లి వచ్చి నిర్మాణ పనులను పరిశీలించారు. నాని చేతులమీదుగా విరాళాన్ని ఆశ్రమ నిర్వాహకులు శీలం భాస్కరరావు దంపతులకు అందజేశారు. గొర్రెపాటి పిచ్చేశ్వరరావు, దాసి సీతారామరాజు, బుల్లా కిషోర్, సేవాసంస్థ ముఖ్యులు నాదెళ్ల ఉమాదేవి, వి.కామేశ్వరి, జి.మహాలక్ష్మి, ఎం.నళిని, పి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐ విజయ్ సాయం అభినందనీయం

పెదపారుపూడి : యలమర్రు గ్రంథాలయ అభివృద్ధికి ఎన్‌ఆర్‌ఐ, పూర్వ విద్యార్థి ఎవరెస్ట్ సాఫ్ట్‌వేర్ కంపెనీ సీఈవో సజ్జ విజయ్ కుమార్ సహకారం అందించటం అభినందనీయమని టీడీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సూరపనేని వెంకట సత్యనారాయణ అన్నారు. యలమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సూరపనేని వెంకట సత్యనారాయణ మాట్లాడుతూగ్రంథాలయాన్ని డిజిటల్ గ్రంథాల యంగా మారుస్తానని ఎన్‌ఆర్‌ఐ విజయ్ కుమా ర్ తెలియజేశారన్నారు. గ్రంథాలయాధికారి జె.విజయలక్ష్మి, గ్రామ సర్పంచ్ కొల్లూరి అనూష, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ఎంపీ విజయసాయిరెడ్డి క్షమాపణ చెప్పాలి

గుడివాడ : పాత్రికేయులను అకారణంగా దూషించిన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి జర్నలిస్టులకు క్షమాపణ చెప్పాలని గుడివాడ ప్రెస్‌క్లబ్ (ఏపీయూడబ్ల్యూజే అనుబంధం) అధ్యక్షుడు గూడపాటి రాజు డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బాధ్యతగల ప్రజాప్రతినిధి అయి ఉండి అసభ్య పదజాలం వాడటం సరికాదని హితవు పలికారు. జర్నలిస్టులకు ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మహ్మద్ జబీవుల్లా, శ్యామ్, విజయప్రసాద్, ఏడుకొండలు, ముఖర్జీ, గోపాలకృష్ణ, రాజేష్, తంబి, వీర్ల శ్రీనివాస్, సురేష్‌బాబు, బుజ్జిబాబు, ఉపేంద్ర, ఎల్.శ్యామ్‌కుమార్, పండుబాబు, మాగంటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భాస్కరరావుకు ఎమ్మెల్యే మండలి నివాళి

కోడూరు : హంసలదీవి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బోయిన భాస్కరరావు (84) గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందాడు. భాస్కరరావు భౌతిక కాయాన్ని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. బండే శ్రీనివాసరావు, గోగినేని సోమశేఖరరావు, చంద్రరావు, మేడా శివాజీ, ఇజ్జినేని శివాజీ పాల్గొన్నారు.

లయన్స్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం నేడు

పామర్రు : పామర్రు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం బుధవారం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ప్రతినిధి ఎల్. శ్రీనివాసరావు తెలిపారు.

మొవ్వ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం రేపు

కూచిపూడి : మొవ్వ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొండేటి ఇందిర అధ్యక్షతన ఈనెల 18వ తేదీ గురువారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖరరావు తెలిపారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఈ సమావేశానికి హాజరై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

రైలింజను ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

పెడన : రైలింజను ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం పెడన రైల్వేస్టేషన్‌లో జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో మచిలీపట్నం నుంచి గుడివాడ వైపు వెళుతున్న రైలు ఇంజను మార్గమధ్యంలోని పెడన రైల్వేస్టేషన్‌లో పట్టాలు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు తెల్లపూల చొక్కా, సిమెంటు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, వయసు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని, మనిషి లావుగా ఉన్నాడని రైల్వే పోలీసులు తెలిపారు.



ఎస్టీలకు దుస్తులు పంపిణీ

మచిలీపట్నం టౌన్ : పేదరికంలో మగ్గుతూ కనీస అవసరాలు లేకుండా ఉన్న ఎస్టీ కాలనీలను అభివృద్ధి చేయాలని లంకిశెట్టి బాలాజీ అన్నారు. మలకాపట్నం మన కన్వెన్షన్ హాలులో గొరిపర్తి శ్రీధర్ తదితరులు 200 మంది ఎస్టీలకు చీరెలు, లుంగీలు, టవల్స్ ఆర్థిక సాయం అందించారు. టీడీపీ నాయకులు నడకుదిటి అర్జునరావు, మాజీ కౌన్సిలర్ కోసూరు లక్ష్మీనాంచారయ్య, గొరిపర్తి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ట్రీ కటింగ్ మిషన్ వితరణ

పమిడిముక్కల : కపిలేశ్వరపురం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ ఉద్యోగులకు ట్రీ కటింగ్ మిషన్‌ను క్లబ్ కార్యదర్శి తుమ్మల వెంకట గంగాధరరావు మంగళ వారం అందజేశారు. రోడ్లపక్కన పెరిగిన చెట్లు విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉండి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్న పరిస్థితుల్లో కొమ్మలు నరికేందుకు కటింగ్ మిషన్ అందజేయాలన్న ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు రూ.12 వేలు విలువ చేసే మిషన్‌ను అందజేశారు. క్లబ్ చిగురుపాటి జగదీశ్, అధ్యక్షుడు కడియాల ప్రకాశరావు పాల్గొన్నారు.

సెల్ షాపులో చోరీ

పెడన : బంగ్లా స్కూల్ సెంటర్‌లోని సెల్ షాపులో సోమవారం రాత్రి చోరీ జరిగింది. దొంగలు షట్టర్ తాళాలు పగులకొట్టి నిమిది టచ్ ఫోన్లు, 25 మామూలు ఫోన్లు, రూ. 10 వేల నగదు అపహరించుకుపోయారు. యజమాని ఫిర్యాదు మేరకు ఎస్సై సూర్యశ్రీనివాస్ దర్యాప్తు చేపట్టారు.

వృద్ధులకు అన్నదానం

గుడివాడ : శ్రీకృష్ణ యావద సేవా సంఘం ఆధ్వర్యంలో కుంభం మోహనరావు, రత్నమాణిక్యం మనుమరాలు ఐదా పుట్టినరోజు సందర్భంగా శాంతి వృద్ధాశ్రమం, కరుణపీఠంలో వృద్ధులకు భోజనం కల్పించారు. సయ్యద్ గఫార్, సంఘ సభ్యులు తాతారావు, తిరుపతయ్య, పార్వతీశ్వరరావు, నాగమణి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.